ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 16 | సంచిక : 02 | అక్టోబర్ 2010

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు ~ 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....
జిన్నూరు ....... 01-09-2010
హైదరాబాద్ .. 23-09-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1-9-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు కృష్ణాష్టమి. దీనిని కొంతమంది జన్మాష్టమి అని, కొంతమంది గోకులాష్టమి అని, కొంతమంది మధురాష్టమి అని అంటారు. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలలో రాధాష్టమి కూడా బాగా చేస్తారు. రాధ గురించి మీరు బాగా తెలుసుకోవాలి అంటే బ్రహ్మవైవర్తపురాణము చదవాలి. రాధాకృష్ణుల ఆప్యాయత గురించి అందులో మీకు తెలుస్తుంది. రామావతారం, నరసింహస్వామి అవతారం, కృష్ణావతారం ఈ అవతారాలన్నీ మహావిష్ణువే ధరించాడు అని వైష్ణవులు చెపుతారు. శ్రీకృష్ణచైతన్య స్థాపించిన హరేకృష్ణ వారు మాత్రం ఈ అవతారాలన్నీ కృష్ణుడే ధరించాడు, కృష్ణుడే సుప్రీమ్ అని చెపుతారు. వైష్ణవులు వైకుంఠానికి వెళ్ళాలని, శివభక్తులు కైలాసానికి వెళ్ళాలని అనుకొంటారు. ఈ లోకాలు ఉన్నమాట నిజమే కాని ఇవన్నీ పారమార్థిక సత్యాలు కాదు. ఈ శరీరం ఎంత నిజమో, ఈ ప్రపంచం ఎంత నిజమో ఈ లోకాలు కూడా అంతే నిజం. ఈ లోకాలు వ్యవహారిక సత్యాలు మాత్రమే. పారమార్థిక సత్యం మన హృదయంలోనే ఉంది.

మన హృదయంలోనే బ్రహ్మపదార్థం ఉంది. బ్రహ్మం అంటే చాలా పెద్దది కదా, అంత బ్రహ్మం ఇంత చిన్న హృదయంలో ఎలా ఉంటుంది అని కొంతమంది అంటారు. బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది. అంతటా వ్యాపించి ఉన్న వస్తువు హృదయంలో కూడా ఉంటుంది కదా. బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది. ఈ జీవకోటికి, పంచభూతాలకు ఆధారంగా కూడా ఉంది. అందుచేత బ్రహ్మజ్ఞానం పొందాలి అని మనవారు చెపుతూ ఉంటారు. బ్రహ్మం అంతటా ఎలా వ్యాపించి ఉందో అలాగ బ్రహ్మజ్ఞానం

పొందినవాడు అంతటా వ్యాపించి ఉంటాడు. వాడు సుఖస్వరూపాన్ని, ఆనందస్వరూపాన్ని, శాంతిస్వరూపాన్ని పొందుతాడు. వాడికి ఫలకాంక్ష ఏమి ఉండదు, అసలు వాడికి దేహంతో పనిలేదు. కృష్ణం వందే జగద్గురుమ్. ఈ పేరు కృష్ణుడికి, ఆదిశంకరాచార్యులవారికి మాత్రమే ఉంది. ఎవడైతే బ్రహ్మజ్ఞానం అనుభవంలో పెట్టుకొని, బ్రహ్మవిద్యను ఇతరులకు బోధిస్తూ, బ్రహ్మపదార్థాన్ని వారికి అనుభవంలోనికి తీసుకొని రాగలడో వాడే బ్రహ్మవిద్యాభాస్కరుడు, వాడే జగద్గురువు. అన్నింటికంటే సత్యం గొప్పది అని చాలామంది చెపుతారు. కాని కృష్ణుడు దృష్టిలో సత్యం కంటే ధర్మం గొప్పది. భారతయుద్ధంలో ధర్మరాజుచేత అబద్ధం చెప్పించాడు. అంటే కృష్ణుడు అసత్యవాది అని అనుకోకూడదు. ధర్మసంస్థాపనకోసం అవసరమైతే ఒక అబద్ధం చెప్పించేవాడు. అక్కడ ధర్మమే ముఖ్యం. ధర్మాన్ని స్థాపించటం కోసం వచ్చిన అవతారం కాబట్టి సత్యానికంటే ధర్మానికి ఎక్కువ విలువ ఇచ్చాడు.

కృష్ణుడు చూపించిన లీలలు ఇంక ఏ అవతారంలోను కనబడవు. ఆయన గోకులం వచ్చాక అనేక లీలలు చూపించాడు, ఆయనది ప్రేమావతారం. మనం సర్వసాధారణంగా మనిషి యొక్క బాహ్యజీవితం చూస్తాము కాని లోపలజీవితం చూచే అలవాటు మనకు లేదు. లోపల వాడి హృదయం ఎటువంటిది, లోపల ఉన్న సౌందర్యం ఎటువంటిది అని చూసే శక్తి మనకు లేదు. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ఈ దేహమే నిజం, ఇంక ఏదీ నిజం కాదు అనుకొంటాము. ఎందుచేతనంటే మనది సంస్కరింపబడిన మనస్సుకాదు, సంస్కరింపబడిన బుద్ధికాదు. మనం మంచిని చెడ్డ అనుకొంటాము, చెడ్డను మంచి అనుకొంటాము. అది మన బుద్ధిలో ఉన్న దోషం. ఆ దోషాన్ని పోగొట్టుకోవటానికి భగవంతుడు చెప్పిన మాటలను శ్రవణం చేయటం, అధ్యయనం చేయటం, సత్పురుషులతో సహవాసం అవసరం. కొంతమంది ఉదయం చాలా శ్రద్ధగా పూజ చేస్తారు, అది కూడా సాధనే. మనలను మనం బాగుచేసుకోవటానికి పూజ, జపం, ధ్యానం ఇవన్నీ పెద్దలు ఏర్పాటుచేసారు. పూజ అనేది ఎవరో ఇతరులు చూసి సంతోషించటానికి కాదు, మీరు బాగుపడటానికి అది ఏర్పాటు చేసారు. కృష్ణుడు ప్రేమస్వరూపుడు, దయాస్వరూపుడు. పూతన అనే రాక్షసి కృష్ణుడిని చంపటానికి యశోద ఇంటికి వచ్చింది. ఆవిడ స్థనం అంతా విషంపూసుకొని, ఆ విషంపాలు కృష్ణుడిచేత తాగించింది. వీడు బాగానే తాగుతున్నాడు ఇంక చనిపోతాడు అని పూతన అనుకొంది, కాని ఆయన ముందుపాలు తాగేసాడు తరువాత ఆవిడ రక్తం అంతా తోడేసాడు అప్పుడు పూతన చనిపోయింది. పూతన చనిపోయిన తరువాత ఆవిడను జననమరణచక్రంలో నుండి తప్పించి మోక్షం ప్రసాదించాడు. ఎందుచేతనంటే అది ఆవిడకు పుట్టినబుద్ధికాదు. కంసుడు ప్రోత్సహిస్తే అలా చేసింది. కృష్ణుడు పూతనని చంపేసాడు అని లోకం అనుకొంటుంది

కాని పూతన చనిపోయిన తరువాత ఆ జీవుడు తిరిగి ప్రకృతిలోనికి రాకుండా మోక్షాన్ని ప్రసాదించాడు, వాడు భగవంతుడు. భగవంతుడు ఆయన చేతులతో ఎవరినైనా చంపాడు అనుకోండి ఆయన చంపేసాడు అని మనం అనుకొంటాము కాని ఏదో సమాజంకోసం వారిని చంపి వారికి మోక్షాన్ని ఇస్తాడు. అంతేగాని అక్కడ వ్యక్తిగతమైన వైరాలు ఏమీ కాదు.

కృష్ణుడు గోకులం నుండి బృందావనం వచ్చాడు. బృందావనంలో అనేక లీలలు జరిగినాయి. బృందావనంలో కృష్ణుడు ఎక్కడ నివసించాడు, ఎక్కడ తిరిగాడు, ఆయన చేసిన రాసలీలలు వీటి అన్నింటి గురించి వివరాలు తెలియపర్చినవాడు శ్రీకృష్ణచైతన్య. కృష్ణుడు బృందావనంలో ఉండగా ఒకసారి బ్రహ్మదేవుడు ఏమి చేసాడు అంటే గోపబాలురను, వారి ఆవులను మాయం చేసేసాడు. గోపబాలురను, ఆవులను విడిచిపెట్టమని కృష్ణుడు బ్రహ్మదేవుడిని అడగలేదు. మొత్తం గోపబాలురు ఎంతమంది ఉన్నారో, ఆవులు ఎన్ని ఉన్నాయో ఆ రూపాలు అన్నీ ఆయనే ధరించేసాడు. వాడు కృష్ణుడు. మామూలుగా అందరూ ఎవరి ఇంటికి వారు వెళ్ళిపోయారు, ఆవులు కూడా ఇంటికి వెళ్ళిపోయినాయి. వారు మన పిల్లలే, అవి మన ఆవులే అని ఇంట్లోవారు అనుకొంటున్నారు ఎందుచేతనంటే ఏమీ తేడాలేదు. అలాగ మూడు, నాలుగు రోజులు చూసాడు చివరకు బ్రహ్మదేవుడికే సిగ్గేసి గోపబాలురను, ఆవులను వదిలేసాడు. కృష్ణుడు ఏడవ సంవత్సరంలో కాళీయసర్పం నెత్తిమీద డాన్స్‌చేసి, ఆ సర్పాన్ని అణిచివేసాడు. మనం నిరంతరం కృష్ణ నామాన్ని స్మరించుకోవటం వలన, ఆయన రూపాన్ని ధ్యానించటం వలన ఆయన కాళీయసర్పాన్ని ఎలా అణిచివేసాడో అలాగ మన అహంకారాన్ని, మమకారాన్ని అణిచివేస్తాడు అని కృష్ణభక్తులు అంటారు. ఒకసారి గోపబాలురు అడవిలో ఆవులను మేపుతూ ఉంటే బ్రహ్మదేవుడు అడవి అంతా అగ్నిపుట్టించాడు. నిప్పను చూసి గోపబాలురు, ఆవులు అన్నీ పారిపోతున్నాయి. కృష్ణుడు ఏమి చేసాడు అంటే ఆ నిప్పను దగ్గరకు రానిచ్చి నిప్పనంతా మింగేసాడు. వాడు దేవుడు. ఇటువంటి అనేక మహిమలు ఆయన చేసాడు.

రాధాకృష్ణ లీలలు కూడా బృందావనంలో కనిపిస్తాయి. రాధాకృష్ణుల ప్రేమకు దేహాలతో సంబంధం లేదు. సర్వసాధారణంగా దేహ సంబంధం, కుటుంబ సంబంధం, స్నేహాలు ఇటువంటి అనుబంధాలు లేకుండా ఒక మనిషిని మీరు ప్రేమించలేరు. భార్యాభర్తల ప్రేమకు ఎక్కువ కారణం దేహసంబంధమే. రాధాకృష్ణుల ప్రేమ అటువంటిది కాదు. దేహ సంబంధం లేకుండా రాధ తన మనస్సును నూటికి నూరుపాళ్ళు కృష్ణుడికి అర్పించింది. రాధ ఒక మాట మాట్లాడినా, ఒక పని చేసినా ఏమి చేసినా అది కృష్ణుడికోసమే, భౌతికమైన వాంఛలు ఏమీ లేకుండా, వాడు ఆత్మజ్ఞానం ప్రసాదిస్తాడు ఇటువంటి వాంఛలు ఏమీ లేకుండా కేవలం ప్రేమ ప్రేమకోసమే

రాధ కృష్ణుడిని ఆరాధించింది కాబట్టి మనకు రాధే ఆదర్శం. రాధ కృష్ణుడిని ఎలా ఆరాధించిందో అలాగ మనం కూడా కృష్ణుడిని ఆరాధిస్తే ఈ జన్మలోనే మనం తరిస్తాము. అది భౌతికమైన ప్రేమకాదు, దివ్యప్రేమ. ప్రేమే రాధ రూపంలో పుట్టింది. కృష్ణుడి దగ్గర ఏమీ ఆశించకుండా కేవలం ప్రేమ ప్రేమ కోసమే ప్రేమించిన వ్యక్తి రాధ. రాధను ఆదర్శంగా పెట్టుకొని అలాగ మనం వాసుదేవస్వామిని ప్రేమించగలిగితే ఇంక మనకు పునర్జన్మ లేదు. జార్జిబెర్నార్డ్‌షా నాటకాలు వ్రాసాడు. ఆయన శాఖాహారమే తింటాడు. మీరు మాంసాలు, చేపలు ఎందుకు తినరు అని అడిగితే నా పొట్ట స్మశానం కాదు, చనిపోయినవాటిని స్మశానంలో పడేస్తారు. వాటిని నేను తింటే నా పొట్ట స్మశానంతో సమానము. నాది పొట్టేకాని అది స్మశానం కాదు అందుచేత స్మశానంలో వేసే వస్తువులను నా పొట్టలో ఎందుకు వేసుకొంటాను అన్నాడు. ఆయన మేన్ అండ్ సూపర్‌మేన్ డ్రామా వ్రాసాడు. ఆయన సూపర్‌మేన్ గురించి ఏమన్నాడు అంటే ఎవడైతే తన మాటద్వారాకాని, చేతద్వారాకాని, మనస్సుద్వారాగాని తోటి మానవులను హింసపెట్టడో, ఎవడిలోనుండి అయితే ప్రేమ ప్రవహిస్తూ ఉంటుందో వాడు సూపర్‌మేన్ అని చెప్పాడు. నీ ఆరోగ్యం డాక్టర్లచేతిలో ఉంది అనుకొంటున్నావు కాదు నీ వివేకం చేతిలో ఉంది. ఏది తినవచ్చు, ఏది తినకూడదు అనేది నువ్వు జాగ్రత్తగా చూసుకోవాలి. బ్రాహ్మీస్థితి అంటే అది చనిపోయిన తరువాత పొందేది కాదు. ఇప్పడే మనం పొందవచ్చు. రామకృష్ణ పరమహంస దగ్గర 16 మంది పిల్లలు ఉండేవారు. వారికి ఆయనతో పూర్వజన్మ సంబంధం ఉంది. వారు బయట ఏదో చదువుకొనేవారు ఆయన మాత్రం ఈ 16 మందిని వారు ఏమి చేస్తున్నారో అబ్జర్వుచేసుకొనేవారు. అది హ్యూమన్ లవ్‌కాదు, డివైన్‌లవ్. మీరు ఎక్కడ ఉన్నారు, తొందరగా దగ్గరకు వచ్చేయండి అని కేకలు పెట్టేవారు. రామకృష్ణుడు అలా అంటూ ఉంటే అక్కడ ఉన్నవారికి అది అర్థంకాక ఆయనను మేడ్‌మేన్ అనుకునేవారు. ఆ 16 మంది దగ్గరనుండి ఆయన ఏమీ ఆశించలేదు, అక్కడ లస్ట్ ఏమీ లేదు, అది ప్యూర్ లవ్.

రమణమహర్షిగారు అరుణాచలం వచ్చి కొత్తగా పొందింది ఏమీ లేదు. ఆయన పొందవలసింది ఏదో మధురైలోనే పొందారు. ఆయన అరుణాచలం ఎందుకు వచ్చారు అంటే అది ఆ దేహ ప్రారబ్దం, అరుణాచలానికి ఆయనకు ఉన్న జన్మాంతర అనుబంధం. ఆయన 1896వ సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీన సూర్యుడు ఉదయించే కాలంలో అరుణాచలం రైల్వేస్టేషన్‌లో దిగారు. రైల్వేస్టేషన్‌లో దిగిన తరువాత డైరెక్టుగా అరుణాచలేశ్వరుడి గుడిలోనికి వెళ్ళారు. ఓ తండ్రీ నువ్వు రమ్మంటే నేను వచ్చాను, నా అంతట నేను ఇక్కడకు రాలేదు. దీనిని ఎలా ఉపయోగించుకోవాలో అలాగ ఉపయోగించుకో అని తనను తాను అర్పించుకొన్నారు, అంటే అరుణాచలేశ్వరుడికి శరణాగతి చేసారు. గుడిలో నుండి బయటకు వచ్చిన తరువాత

ఆయన అక్కడ 54 సంవత్సరాలు గడిపినా మరల గుడిలోనికి ఎప్పుడూ వెళ్ళలేదు. యాత్రలు చేయటంవలన, గుడిలోనికి వెళ్ళటంవలన, యజ్ఞాల వలన, యాగాల వలన మొత్తం ఈ కర్మలు అన్నీ చేయటం వలన ఏ ఫలితం వస్తుందో దానిని అంతుకు ముందే పొందేశాడు. అంటే ఆ స్థాయిలో ఆయనకు వీటితో పనిలేదు. అంతేగాని ఆయన గుడిలోనికి వెళ్ళలేదని మనం వెళ్ళటం మానకూడదు. అక్కడ నీవు, నేను అనే బేధభావం లేదు, అది అద్వైతానుభవం.

కొంతమంది ఏదో పనిచేస్తారు. అస్తమాను దాని ఫలితం కోసం ఆలోచిస్తారు. అటువంటి వారికి ఆత్మజ్ఞానం రాదు, వారు బ్రాహ్మీస్థితిని పొందలేరు. వచ్చేది వస్తుంది, రానిది రాదు. మనందరిలో బలహీనత ఏమిటి అంటే కోరిక ఉంటే ఎక్కువ వస్తుంది, మనం కోరుకోకపోతే రాదేమో అనుకొంటాము. వచ్చేది ఏదో అది నీ కోరికతో సంబంధం లేకుండా వస్తుంది. కోరుకోకపోతే రాదేమో అని అస్తమాను ఏదో ఒకటి కోరుకొంటూ ఉంటాము దాని వలన మనస్సులో కల్మషం పెరిగిపోతుంది. ఎక్కడైతే స్వార్థం ఉందో ఆ మనిషి పాపం చేయకుండా ఉండలేడు. కర్మఫలం పట్ల ఆసక్తి ఉన్నవాడికి, మమత ఉన్నవాడికి, వ్యక్తిభావన ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగదు. మన యోగ్యతను బట్టి, అర్హతను బట్టి మనకు వచ్చేది వస్తుంది. కోరికను బట్టి వచ్చేస్తుంది అనుకోవటం వెర్రితనం, మూర్ఖత్వం కూడా. రాధ ఎప్పుడూ గుర్తింపులకోసం పని చేయలేదు. మనం ఒకమాట మాట్లాడాము దీనివలన భగవంతుడు ఇష్టపడతాడా లేదా, మనం ఒక పనిచేసాము దీనివలన భగవంతుడు ఇష్టపడతాడా లేదా అని చూసుకొంటూ భగవంతుడు ఇష్టపడే పనులు, ఆయన ఇష్టపడే మాటలు, ఆయన ఇష్టపడే ఆలోచనలు వచ్చేలా చూసుకొనేది రాధ. ఆమెకు లోకం గొడవ ఏమీ లేదు. అలా ఉన్నవారికి వారు అడగకుండానే బ్రాహ్మీస్థితి వస్తుంది. బెర్నార్డ్‌షా ఏమన్నాడు అంటే మన ఇంటి దగ్గర ఉన్న తల్లితండ్రులు దేహానికి సంబంధించినవారు. వారు ఆవకాయపట్టుకొంటే తీసుకొని వెళ్ళమని మనకు ఇస్తారు, పది రూపాయలు ఇస్తారు లేకపోతే రెండు ఎకరాల భూమి ఇస్తారు. వారు అంతవరకే పనికివస్తారు. నా వివేకమే నా నిజమైన తండ్రి, నా వైరాగ్యమే నా నిజమైన తల్లి అని చెప్పాడు. వివేకం ఏమి చేస్తుంది అంటే ఇది పనికి వస్తుంది, ఇది పనికిరాదు అని విభజన చేస్తుంది. వైరాగ్యం ఏమి చేస్తుంది అంటే పనికిరాని చోటుకు మనలను వెళ్ళనివ్వదు, అందుచేత వారే నా నిజమైన తల్లితండ్రులు, వారు ఉంటే మనకు జ్ఞానం వచ్చేస్తుంది.

మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా బ్రాహ్మీస్థితిని పొందాలి. ఋషులు వారు ఏ పద్ధతిలో బ్రాహ్మీస్థితిని పొందారో ఆ పద్ధతినే టీచ్ చేసారు. భగవద్గీత అలా కాదు, అన్ని మార్గాలను సమన్వయం చేసి భగవంతుడు చెప్పాడు. ఏ మార్గంలో అయినా మీరు

సిన్సియర్‌గా, డెడికేటెడ్‌గా ప్రయాణం చేస్తే నన్నే పొందుతారు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మళయాళస్వాములవారు ఏమనిచెప్పారు అంటే మీరు భగవద్గీత చదవండి, భగవద్గీత చదవండి అని చెప్పినా మీరు చదవరు. నుదిటిమీద గీత బాగా ఉన్నవాడికి మాత్రమే గీత చేతికి దొరుకుతుంది. మీరు పూర్వజన్మలో ఏవైనా పుణ్యకర్మలు చేసి ఉంటే భగవద్గీత చదవాలి అనిపిస్తుంది కాని లేకపోతే చదవాలనే బుద్ధికూడా మీకు కలుగదు అని చెప్పారు. ఆనందం అంటే బ్రహ్మానందమే. బ్రాహ్మీస్థితి పొందటం వలన వచ్చే ఆనందం మాత్రమే పెర్మనెంట్‌గా ఉంటుంది. మిగతా భౌతికమైన సుఖాలు మీకు ఎప్పుడు వచ్చినా అవి తాత్కాలికం మాత్రమే కాని ఏదీ శాశ్వతంకాదు. అందుచేత మీరు ఇంటి దగ్గరకాని, సమాజంలోకాని మీ డ్యూటీ ఏదో మీరు చేసుకొని నిరంతరం రాధ కృష్ణుడి మీద మనస్సు ఎలా నిలబెట్టిందో అలాగ మీరు మనస్సును భగవంతుడి మీద నిలబెట్టి ఉంచితే మీకు బ్రాహ్మీస్థితి కలుగుతుంది. భగవద్గీత ఇప్పుడు మనకు అర్థంకాదు. కోరిక ఎలా ఉంటుందో తెలియని మనస్సును సంపాదించి అప్పుడు చదివితే గీత మనకు అర్థమవుతుంది. ఈ పండితులకా గీత అర్థమయ్యేది అనేవారు రామకృష్ణుడు. వారు శబ్దాన్ని విడదీసి అర్థం బాగాచెపుతారు, మాకు తెలిసిపోయింది అనుకొంటారు, అటువంటివారికా గీత అర్థమయ్యేది. నిర్మలమైన మనస్సును, నిష్కల్మషమైన మనస్సును పొంది అప్పుడు గీత చదివితే అది నీ గుండెకు పడుతుంది అనేవారు.

రవీంద్రనాథ్‌ఠాగూర్ తండ్రి దేవేంద్రనాథ్‌ఠాగూర్. ఒకసారి రామకృష్ణుడిని ఠాగూర్ ఇంటికి తీసుకొని వెళ్ళారు. దేవేంద్రనాథ్‌ఠాగూర్ వేదాలు, ఉపనిషత్తులు బాగా చదువుకున్నారు. ఎవరు ఏది మాట్లాడినా వేదములోనిది కోడ్‌చేసి చెపుతూ ఉండేవారు. రామకృష్ణుడు బయటకు వచ్చిన తరువాత దేవేంద్రనాథ్‌ఠాగూర్ గొప్ప పండితుడు అని ఆయనతో ఉన్నవారు అన్నారు. రామకృష్ణుడు ఏమన్నారు అంటే ఆయన పండితుడు అయిన మాట నిజమే ఎంతోకొంత యోగాభ్యాసం చేస్తున్న మాట నిజమే కాని ఈ లోకాన్ని ఎంజాయ్ చెయ్యాలి, భోగాలను అనుభవించాలి అనేటువంటి మనస్సు ఆయనకు పోలేదు. ఆ భోగ ప్రవృత్తి నిశ్శేషంగా కరిగితేనే కాని బ్రాహ్మీస్థితిని పొందలేరు. బ్రహ్మానుభవం లేకుండా వారు బాహ్యంగా మంచి పనులు చేసినా వారికి సమాజంలో కీర్తి రావచ్చు కాని లోపల సున్న. నువ్వు బాహ్యజీవితం చూస్తే ఎలాగ, లోపల ఎలాగ ఉందో చూడాలి కదా. మెరిసేదంతా బంగారము కాదు కదా అది రామకృష్ణుడు చెప్పేది. మనిషికి కర్తృత్వం వల్ల దుఃఖం వస్తోంది. నేను మీకు కర్తృత్వం కల్పించలేదు ఇదంతా మాయ చేస్తోంది వీటిని ఓవర్‌కమ్ చేసే వరకూ నన్ను పొందలేవు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం మనస్సుతోటి నిరంతరము ఏది చింతిస్తే ఏ రోజుకైనా అది అయి తీరుతాము. రాధ కృష్ణుడిని స్మరించి స్మరించి ఆయనను పొందింది.

నిరంతరం మీరు డబ్బు గురించి ఆలోచిస్తున్నారు అనుకోండి ఎప్పటికైనా మీరు ధనవంతులు అవ్వవచ్చు, లేకపోతే సమాజంలో గౌరవం కోసం మీరు పనులు చేస్తున్నారు అనుకోండి మీకు గౌరవం రావచ్చు. ఇవన్నీ మూడు రోజుల ముచ్చటే. అందుచేత మీరు ఇంటి దగ్గర ఉన్నా, ఎక్కడ కూర్చున్నా శరీరం గొడవ వదిలేయండి. మనస్సుతో ఏది చింతిస్తున్నారో పరిశీలన చేసుకోండి. ఎందుచేతనంటే మీరు నిరంతరము ఏదైతే చింతిస్తున్నారో అదే అవుతారు.

రాణి రాచమణి అల్లుడి పేరు మధురబాబు. రాణి రాచమణి చనిపోయాక సంస్థానం మీద అల్లుడు పెత్తనం చేసేవాడు. వాడు రామకృష్ణుడు గురించి ఒకమాట చెప్పాడు. నాకు ఉన్న ఆస్తి అంతా వీడికి రాసి ఇచ్చేసినా, నా బ్యాంకు ఎకౌంటు అంతా వీడికి స్వాధీనం చేసినా, ప్రపంచములో ఎవడికీ లేని పేరు ప్రఖ్యాతులు వీడికి వచ్చినా వాడు వైరాగ్యమార్గం విడిచిపెట్టి బయటకు రాడు అని చెప్పాడు. వాడు రామకృష్ణుడు. మధురబాబుతో రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నీ బలహీనతలు ఏమిటో నాకు తెలుసు నీ బలహీనతలు అన్నీ కలుపుకొనే నిన్ను ప్రేమిస్తున్నాను. నీ లోపల పాపం ఉండవచ్చు. నువ్వు పాపము లేనిస్థితికి వచ్చేయాలి అన్నాడు. అది హ్యూమన్‌లవ్‌కాదు, అది డివైన్ లవ్. నా దయలేకుండా నా మాయను ఎవరూ జయించలేరు, అసలు మాయ మీకు దారి ఇవ్వదు, గమ్యానికి వెళ్ళే మార్గము కూడా మీకు కనబడదు అని పరమాత్మ చెప్పాడు. కర్మఫలం పట్ల ఆసక్తి వద్దు. కర్మఫలం గురించి ఆలోచించకపోయినా వచ్చేది వస్తుంది. అది మీకు తెలియక కర్మ చేసి దాని ఫలితం గురించి ఆలోచించి మీ తలకాయ పాడుచేసుకొని పునర్జన్మలు పెంచుకొంటున్నారు. తుకారామ్ ఏమి చెప్పాడు అంటే నేను ఎవడను అని విచారణ చేసి ఆ నేనును పోగొట్టుకొనే వారు ఉండవచ్చు. పాండురంగడిపట్ల నాకు ఉన్న ప్రేమభావనలో, దివ్యభావనలో దేహగతమైన నేను నాకు తెలియకుండానే పోయింది, అది ఎప్పుడు పోయిందో నాకు తెలియదు అన్నాడు. వాడు తుకారామ్. ఈశ్వరుడు అంతర్యామి. మనలో ఏ తలంపులు ఉన్నాయి, ఏ బలహీనతలు ఉన్నాయి అని చూస్తాడు. నీకు లోపల బేధభావన ఉన్నప్పుడు అబేధస్థితి ఎందుకు ఇస్తాడు, ఇవ్వడుకదా. నీకు ఏదైనా ఇవ్వవలసి వస్తే ఆ యోగ్యత నీకు ఉన్నప్పుడు ఏమీ అనుమానించకుండా ఇచ్చేస్తాడు. భగవంతుడికి పక్షపాతం ఏమీలేదు.

ఒకసారి రామకృష్ణుడు, ఆయన మేనల్లుడు గంగానదిలో స్నానం చేసి వస్తున్నారు. దారిలో బెంగాల్ గవర్నర్‌గారి ఇల్లు ఉంది. రామకృష్ణుడు తలవంచుకొని వచ్చేస్తున్నారు. మేనల్లుడు గవర్నరుగారి మేడను చూసి మావయ్యా, మావయ్యా నువ్వు అక్కడ ఆగు, ఇక్కడ ఉన్న అందాలు చూడకుండా వెళ్ళిపోతున్నావు అన్నాడు. అదంతా చూసాను, ఈ మేడలు,

గవర్నరు పదవులు ఇవన్నీ మూడు రోజుల ముచ్చట. ఇటువంటి ఆకర్షణలలోనికి వెళ్లవద్దు. నీకు ఉన్నదేదో నీకు ఉంది. నువ్వు పొందేది ఏదో పొందుతున్నావు, దానితో సంతృప్తిపడు. ఆ గవర్నరుగారి మేడ గొడవ నీకు ఎందుకురా వచ్చేయి అని రామకృష్ణుడు చెప్పాడు. అంటే దాని అర్థం ఏమిటి అంటే ఈ మేడలు చూసి, మిద్దెలు చూసి, డాంబికం మనుషులను చూసి నువ్వు మోహపడవద్దు. ప్రపంచాన్ని చూసి నువ్వు మోహపడుతూ ఉంటే నీ మనస్సుకు అంతర్ముఖస్థితి రాదు. ఈ ప్రపంచంలో దేనిని చూసి మోహపడవద్దు, అది సత్యంకాదు, అది స్వప్నసమానము. రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే మనం నేను, నేను అంటున్నాము కదా నువ్వు ఏదైతే నేను, నేను అని అంటున్నావో ఆ నేను నేను కాదని తెలిసేవరకూ నీకు బ్రాహ్మీస్థితి కలుగదు అని చెప్పాడు. రామకృష్ణుడు చెప్పిన ఈ మాటను మనం రోజూ మననం చేసుకోవాలి.

అవతారపురుషులతోటి, యోగులతోటి సంబంధం లేకుండా డైరెక్టుగా హృదయంలో ఉన్న సద్వస్తువును ధ్యానం చేసి దానిని పొందినవారు కొంతమంది ఉన్నారు. కాని దేహబుద్ధి ఉన్నవారు నామరూపాలను విడిచిపెట్టి డైరెక్టుగా లోపల ఉన్న వస్తువును ధ్యానం చేసి దానిని పొందటం చాలాకష్టం. అందుచేత ఎవరో ఒక అవతారపురుషుని తీసుకొని ఆయన నామాన్ని జపిస్తూ, ఆ రూపాన్ని ఆరాధిస్తూ ఉంటే నీకు నిజం తెలియకపోయినా వారికి నిజం తెలుసుకాబట్టి ఆ నామరూపాలు నిన్ను సత్యం వైపుకు గైడ్ చేస్తాయి. మీరు ఏ దేవుడిని ఆరాధిస్తున్నారు, ఏ మార్గంలో ప్రయాణం చేస్తున్నారు అనేది ముఖ్యం కాదు. నదులు ఎన్ని వంకరలు తిరిగి వెళ్లినా, నిదానంగా వెళ్లినా సముద్రంలో కలిసేటప్పుడు నువ్వు నాలో చేరకు అని సముద్రం చెప్పదు, అన్ని నదులు సముద్రంలోనే కలుస్తాయి. అలాగే మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నాలోనే ఐక్యమవుతారు అని పరమాత్మ చెపుతున్నాడు. నేను చెప్పిన మాటల యందు సందేహము పెట్టుకోవద్దు. నమ్మినవారికి సొమ్ము, నమ్మనివారికి దుమ్ము.

కృష్ణుడిని వెన్న దొంగ అంటారు అంటే వెన్నపూసను దొంగిలించి తినేస్తాడు. వెన్నపూస తెల్లగా, మృదువుగా, స్వచ్ఛంగా ఉంటుంది. నీ మనస్సు కూడా వెన్నపూస అంత మృదువుగా, స్వచ్ఛంగా అయితే నీ మనస్సును మింగేసి నా స్వరూపాన్ని ఇస్తాను అని చెప్పటం. రాధ కృష్ణుడిని ఎలా ప్రేమించిందో అలా మనం ప్రేమిస్తే మన మనస్సు వెన్న అవుతుంది. అక్కడ భౌతిక కారణాలు ఏమీలేవు, ఆధ్యాత్మిక కారణాలు ఏమీలేవు. ఈ లోకానికి గాని పరలోకానికి గాని సంబంధించిన కోరికలు ఏమీలేవు. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రేమించింది రాధ. అలా ప్రేమించగలిగితే నీవుకూడా ఈశ్వరుని స్వరూపాన్ని పొందుతావు. అక్కడ భౌతిక

వాంఛలు ఏమీలేవు, మోక్షం కావాలి అనే కోరిక కూడా లేదు. అంటే మోక్షానికి కూడా సన్యాసం చెప్పేయాలి, అది డివైన్‌లవ్. కామం అడుగుతుంది కాని ప్రేమ ఏమీ అడగదు. రాధ కృష్ణుడి దగ్గర నుండి ఎప్పుడూ ఏదీ ఆశించలేదు. నీ బుద్ధిని నాయందే ఉంచు అంటే ప్రకృతి వైపుకు వెళ్ళనివ్వకు. కంచంలో అన్నం తినేసి కంచాన్ని ఒక ప్రక్కన పెట్టేస్తాము కాని కంచాన్ని నెత్తిమీద పెట్టుకొని తిరగము. అలాగే నీకు ఏదైనా పని ఉన్నప్పుడు బుద్ధిని ఉపయోగించుకో, తరువాత నీ బుద్ధిని నాయందే ఉంచు. విచారణామార్గం ద్వారా నిన్ను నీవు బాగుచేసుకొనే శక్తి లేకపోతే నీ బుద్ధిని నాకు ఇచ్చేయి బాగుచేసి పెడతాను అంటున్నాడు పరమాత్మ. నీ మనస్సును నువ్వు నిగ్రహించుకోగలిగితే నిగ్రహించుకో, లేకపోతే నన్ను ఆధారంగా తీసుకొని నీ మనస్సును నా చుట్టూ తిప్పుతూ మనోనిగ్రహం నేర్చుకో. అది చేతకాకపోతే ఇది అయినా నేర్చుకో అంతేగాని రెండింటికి కాకుండా చెడిపోవద్దు. మనోబుద్ధులను ఎప్పుడైతే ఈశ్వరుడికి అర్పించామో, ఎప్పుడైతే మనోనాశనం అయిందో అప్పుడు మనం బ్రహ్మంలోనే ఉంటాము. బ్రహ్మంలోనే జీవిస్తాము. మనకు అడ్డు ఎవరు, మనస్సే అడ్డు. ఆ తెర తెగిపోయింది అనుకోండి మనం బ్రహ్మంలో ఐక్యమైపోతాము. భగవంతుడు చెప్పేమాటలు నిజమా, అబద్ధమా అని భక్తులకు కూడా సందేహాలు వస్తాయి దానికి కారణం భగవంతుడు అసత్యం చెప్పాడనికాదు, అలా అనిపించటానికి మన మనస్సులో ఉన్న కల్మషం కారణం. మనిషికి అసాధ్యం ఉంటుంది కాని భగవంతుడికి అసాధ్యం అంటూ ఏమీ లేదు. భగవంతుడి దయ ఉంటే నువ్వు కూర్చొన్న వాడివి లేవకుండా ఈ క్షణంలోనే మోక్షం వచ్చేస్తుంది. నా మనస్సులో చాలా రుగ్మతలు ఉన్నాయి కదా నాకు ఎలా మోక్షం వస్తుంది అంటే ఆయన దయ వాటినన్నింటిని తరిమేస్తుంది. పూతనకంటే నువ్వు దుర్మార్గుడివా? పూతనకే మోక్షం ఇచ్చిన పరమాత్మ నీకు ఇవ్వడా? ఇప్పుడు మనం ఆయనను స్మరించుకొంటున్నాము. మనం ఆయనను ఎలా స్మరించుకొంటున్నామో అలాగ ఆయన స్మరణలో మనం పడితే వెంటనే మనకు మోక్షం వచ్చేస్తుంది.

సంకల్పాలు లేనివాడు యోగి, సంకల్పాలు లేనివాడు సన్యాసి. మనకు సంకల్పాలు వాసనలో నుండి వస్తున్నాయి. అంటే లోపల వాసన ఉన్నంతసేపు సంకల్పాలు వస్తూ ఉంటాయి. వాసనాక్షయం అయ్యేవరకు సంకల్పాలు రావటం ఆగవు. భగవంతుని దయవలన వాసనాక్షయం అయితేనేకాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. బ్రాహ్మీస్థితి అంటే సామాన్యం అనుకోకండి. సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం, అంత సుఖం ఒక్కసారిగా మీ హృదయంలో నుండి పొంగివచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తాయి. నీకు అర్హత లేకుండా, యోగ్యత లేకుండా, దానిని రిసీవ్ చేసుకొనే శక్తి నీకు లేకుండా ఇస్తే దానిని నీవు తట్టుకోలేవు, సడన్‌గా చచ్చిపోతావు. అందుచేత ఆ అర్హత, యోగ్యత మీకు ఎప్పుడు వస్తుందా అని

భగవంతుడు వెయిట్‌చేస్తున్నాడు. కాని భగవంతుడు బ్రాహ్మీస్థితిని మాకు ఇవ్వటంలేదు అని మీరు గోలచేస్తున్నారు. శరీరము చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అనుకుంటాము అంటే చావు చేతిలో మనం ఓడిపోతున్నాము. నీ శరీరము చనిపోయేలోపులో ఆ చావు నీ చేతిలో ఓడిపోవాలంటే శరీరం చనిపోయిన నేను చనిపోవటం లేదు అనే అనుభవం నీకు రావాలి. నీవు బ్రాహ్మీస్థితి పొందినప్పుడు శరీరము చనిపోయినా ఏదోపోతోంది అని నీకు అనిపించదు. ఎందుచేతనంటే అప్పుడు నీవు నీవుగా ఉంటావు. నిన్ను నీవు తెలుసుకో అని అందరి దగ్గర మీరు అంటారు. అంటే ఎవరిని తెలుసుకోమంటారు అని ఒకరు భగవాన్‌ని అడిగారు. నువ్వు ఏదిగా ఉన్నావో దానిని తెలుసుకో. నువ్వు దేహము అనుకున్నప్పుడు బ్రహ్మమే మనస్సు అనుకున్నప్పుడు బ్రహ్మమే ఇంద్రియాలు అనుకున్నప్పుడు బ్రహ్మమే. నువ్వు అనుకునేది నువ్వు కాదు. నువ్వు ఏదిగా ఉన్నావో అది నీకు తెలియటంలేదు. సాధన చేసి నువ్వు దానిని తెలుసుకో.

నీరు పల్లానికి ప్రవహిస్తుంది. మీలో క్షమాగుణం ఉంటే జ్ఞానం మీలోనికి ప్రవహిస్తుంది. క్షమ అనేది గొప్పగుణం. క్షమించే గుణం ఉంటే నీకు వచ్చే లాభం ఏమిటి అంటే జరిగిపోయిన సంఘటనలు అన్నీ మరిచిపోతారు. జరిగిపోయిన సంఘటనలు మరచిపోండి. భవిష్యత్ గురించి గాలిమేడలు కట్టుకోకండి. వర్తమానకాలంలో సజీవముగా జీవించండి అని చెపుతారు. రాముడికి క్షమాగుణం ఉండేది. తనకు ఎవరు ఎంత అపకారము చేసినా క్షమించే వాడు. రాముడు, కృష్ణుడు యుద్ధాలు చేసినట్టు కనిపిస్తారు. కాని వారికి ఎక్కడా వైరభావన లేదు. ఒకవేళ ఎవరినైనా ఎప్పుడైనా శిక్షించినా వారిని ఉన్నతస్థితికి తీసుకొని వెళ్ళటానికే శిక్షించటం కాని అక్కడ వ్యక్తిగతమైన రాగద్వేషాలు ఏమీ లేవు. మనలాగే వ్యక్తిగతమైన రాగద్వేషాలు ఉంటే వారు దేవతలు ఎలా అవుతారు.

కొంతమందిని చూస్తూ ఉంటే వారికి మనపట్ల ద్వేషం ఉందని తెలుస్తూ ఉంటుంది. వారు ద్వేషిస్తున్నారు అని మీరు తిరిగి ద్వేషించకండి. ఇవన్నీ భగవంతుడు కోసం వదులుకోండి. వారు నిన్ను శత్రువు అనుకోవచ్చు నువ్వు మటుకు వారి పట్ల మైత్రీభావన కలిగి ఉండు. మీరు ఎవరిని నా విరోధులు అని అనుకోవద్దు. అలా అనుకుంటే వారే ఎక్కువగా జ్ఞాపకం వస్తారు. అప్పుడు భగవంతుణ్ణి మరచిపోతారు. అంటే మీరు మాయలో పడిపోతున్నారు. సహనం పెరుగుతూ ఉంటే హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. హృదయం యొక్క లోతులు పెరుగుతూ ఉంటే పరమాత్మ యొక్క స్పర్శ మనకు తెలుస్తూ ఉంటుంది. సాధ్యమైనంత వరకూ సర్వజీవుల పట్ల కంపేషన్ కలిగి ఉండండి. భగవంతుడిని పొందటానికి మనం ఏదో

మార్గంలో ప్రయాణిస్తున్నాము అనుకోండి ఇతరులు ఇంకో మార్గం గురించి చెప్పవచ్చు. అలాగని వారితో విరోధము పెట్టుకోనక్కరలేదు. ఆ మార్గం మనకి నచ్చకపోతే వదిలేయటమే. ప్రారబ్దాన్ని బట్టి ఒకోసారి నీకు దుఃఖం వస్తుంది. ఒకోసారి సంతోషం వస్తుంది. ఈ రెండూ బయటగొడవలు. బయట నుండి వచ్చే గొడవలను బయటే వదిలేయండి, లోపలికి తీసుకోవద్దు. కొంతమంది సంతోషం వస్తే పొంగిపోతారు. దుఃఖం వస్తే కుంగిపోతారు. వారు మనస్సును బేలన్సు చేసుకోలేరు అనుకోండి వారికి బ్రాహ్మీస్థితి రాదు అని పరమాత్మ చెపుతున్నాడు. మీ ప్రారబ్దంలో ఏది ఉంటే అది వస్తుంది ప్రారబ్దంలో లేనిది ప్రయత్నం చేసినా రాదు. మీకు కొంతమందికి 400 కోట్లు ఉన్నా సంతృప్తి ఉండదు. సంతృప్తి లేకపోతే ఆ మనిషికి సుఖం లేదు. మీకు సంతృప్తి అనే గుణం లేకపోతే మీ మనస్సుకి లోచూపురాదు. మనస్సుకు లోచూపు రాకపోతే ఇంక ఆత్మజ్ఞానం కలుగదు. మీరు ఎక్కువ ధనవంతులతో పోల్చుకోవద్దు. ధనవంతుల వలన ఏదో ఉపకారం ఉంటుందని మీరు అనుకోకండి. ఎవరో కొద్దిమంది మంచివారు ఉండవచ్చు. ఒంటెను సూది బెజ్జములో నుండి పంపవచ్చునుగాని ధనవంతులను స్వర్గలోకములోనికి పంపలేము అన్నాడు ఏసు. నువ్వు ధనానికి, దైవానికి ఒక్కసారి పాలేరుగా ఉండలేవు. అంటే ధన పిశాచం ఉన్నవాడు దైవాన్ని ప్రేమించలేడు. దైవము యందు ప్రేమ ఉన్నవాడు వచ్చిన దానితో సంతృప్తి పడతాడు. ఇంకా రావాలి అనే తలంపు వాడికి రాదు.

మీలో మంచి గుణాలు ఉన్నాయి అనుకోండి నాకు మంచి గుణాలు ఉన్నాయి అని మీరు అనుకుంటూ ఉంటే మీరు పతనమైపోతారు. ఎందుచేతనంటే అలా అనుకోవటం వలన ఎదుటివారిలో ఉన్న చెడ్డ గుణాలు మీకు కనిపించటం ప్రారంభిస్తాయి. అప్పుడు వారి కంటే నేనే గొప్పవాడిని అని మీరు అనుకుంటారు. అప్పుడు అహంకారం పెరిగిపోతుంది. అంతకుముందు సంపాదించిన జ్ఞానం ఉంటే అది కూడా ఊడిపోతుంది. మీరు పతనమౌతారు. కొంతమంది దేవుని గురించి చెపితే శ్రవణం చేసి బయటకు వెళ్ళిన తరువాత దేవుడు లేడు అంటే అదే నిజమని నమ్మేవారు ఉన్నారు అటువంటి వారు దేనికీ పనికిరారు. అంటే వారికి ఒక కృతనిశ్చయం లేదు. నిర్మలబుద్ధి ఉంటేనే కాని బుద్ధికి క్లారిటీ రాదు. అందుచేత నిర్మలమైన బుద్ధి ఉండాలి, నిశ్చలమైన బుద్ధి ఉండాలి.

రాధలో గొప్పతనం ఏమిటి అంటే ఆవిడకు కృష్ణచింతనేకాని విషయచింతన ఎలాగ ఉంటుందో తెలియదు. అంటే విషయచింతన వచ్చాక అది కంట్రోల్ చేసుకోవటం కాదు, విషయచింతన అసలు ఎరైజ్ అవ్వలేదు. ఆవిడ రాధ. నిరంతరము కృష్ణుడు గురించి

ఆలోచించేటప్పుడు ఇంక విషయచింతన ఏమి ఉంటుంది. రాధ యొక్క ప్రేమ అలౌకికమైనది, అభౌతికమైనది. అక్కడ లోకానికి సంబంధించిన గౌరవాలు, మర్యాదలు ఇటువంటివి ఏమీ కనబడవు. మనకు ప్రకృతి గుణాలు ఉన్నాయి కాబట్టి మనం సమానముగా ప్రేమించలేము. మీ భర్తని కూడా మీరు ఒకోసారి ప్రేమిస్తారు, ఒకోసారి వీడు దొరికాడు ఏమిటి అనుకుంటారు. అంటే మనసులో దూరంగా ఉంటారు. మనకు ప్రేమ ఉన్న దానిలో హెచ్చుతగ్గులు ఉంటాయి. కాని రాధ యొక్క ప్రేమ అటువంటిది కాదు. అది డివైన్ లవ్. ఆ ప్రేమకు ముగింపులేదు. దానికి మోక్షముతో కూడా సంబంధం లేదు. నీ హృదయములో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు. ఆయనను మీరు ప్రేమించండి. ఆయనకు మీరు శరణాగతి చేయండి. ఆయన ఉన్నాడా లేడా అని సందేహాలు పెట్టుకోవద్దు. ఈశ్వరుని ప్రేమించేకొలది బాహ్యమైన ఆకర్షణలు అన్నీ తగ్గిపోతాయి. మనకు ఈశ్వరుడి మీద ప్రేమ ఎందుకు కలగటంలేదు అంటే దానికి కారణం దేహచింతన, లోకచింతన, విషయచింతన. విషయచింతన ఉన్నంతకాలం దేవుడు మన సమీపములోనికి రాడు. విషయచింతన తగ్గటానికే సత్పురుషుల సహవాసం, సద్గ్రంథ పఠనం అవసరం. ఈశ్వరుడిపట్ల మనకు పరిపూర్ణమైన ప్రేమ కలిగితే ఆ ప్రేమే మనల్ని ఆయన పాదాల దగ్గరకి మోసుకునిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-9-2010, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హిందూమతానికి ప్రమాణగ్రంథాలు మూడు ఉన్నాయి. 1. భగవద్గీత, 2. ఉపనిషత్తులు, 3. బ్రహ్మసూత్రాలు. బ్రహ్మసూత్రాలు వ్రాసినవాడు వ్యాసుడు. ఋషులు శ్రవణం చేసిన విషయాలను వారు మంత్రబద్ధం చేసారు, వాటిని ఉపనిషత్తులు అంటారు. ఉపనిషత్తులు అన్నీ సమన్వయం చేసుకొని భగవంతుడు భగవద్గీత చెప్పాడు. అందుచేత భగవద్గీత అనే చిన్న పుస్తకం మీ దగ్గర కనుక ఉంటే నాలుగు వేదాలు మీ దగ్గర ఉన్నట్లే. భగవద్గీతను మనం అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆచరించటానికి ప్రయత్నం చేయాలి. గాంధీగారు భగవద్గీతను మా అమ్మ అని పిలిచేవారు. చిన్నతనంలోనే మా అమ్మ పోయింది, కాని భగవద్గీత మా అమ్మలేని లోటు తీర్చింది అని గాంధీగారు చెప్పేవారు. నేను రోజూ భగవద్గీత చదవటం వలన నేను ఇబ్బందులలో ఉన్నప్పుడు, ఏమి చెయ్యాలో నాకు తెలియని పరిస్థితులలో ఉన్నప్పుడు నాకు గైడెన్స్ ఇచ్చి, నన్ను రక్షించి ఒడ్డుకు చేర్చింది భగవద్గీత అని గాంధీగారు చెప్పారు. మన మహాత్ములు యోగులు ఎవరు చెప్పినా ఆ మాటలు భగవద్గీతకు అనుగుణంగా ఉండాలి లేకపోతే వారు చెప్పిన మాటలను చాలామంది హిందువులు ప్రక్కన పెట్టేస్తారు.